నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: తిరుపతి నగరంలోని రెండు కేంద్రాల్లో ఆదివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణాధికారులతో సమావేశమయ్యారు. డీఆర్వో మాట్లాడుతూ జూపార్క్ రోడ్డులోని డిజిటల్ జోన్ ఐడీజెడ్ కళాశాలతోపాటు కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలకు మొత్తం 1,929 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. అధికారులు నవజ్యోతి, ఆరోగ్యరాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో స్వామివారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 64,536 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.37 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

28 నుంచి సంస్కార శిబిరం

తిరుపతి కల్చరల్ : రామకృష్ణ మిషన్‌లో ఈనెల 28 నుంచి మే 18వ తేదీ వరకు పిల్లలకు సంస్కార శిబిరం నిర్వహించనున్నట్లు ఆశ్రమం కార్యదర్శి స్వామి సుకృతానంద తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 5 నుంచి 10వ తరగతి విద్యార్థులు శిబిరానికి హాజరు కావచ్చన్నారు. యోగా, ఆర్ట్స్, క్రాఫ్ట్, డ్రాయింగ్, భజనలు, సంస్కృత శ్లోకాలు, భగవద్గీత, గార్లెండ్ మేకింగ్ మెథడ్స్, భారత, సనాతన సంస్కృతి, సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్, కర్రసాము, ఆర్చరీ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వంటి కోర్సులలో శిక్షణ ఉంటుందని వివరించారు. ప్రతి రోజు ఉదయం 8.15 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు రూ.1,200 చెల్లించడంతో పాటు తెల్లదుస్తులు ధరించి హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9493107001, 6360150945 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అన్నదాత 'గజ గజ'



ఏనుగు తొక్కేయడంతో అక్కడికక్కడే చనిపోయిన రైతు సిద్ధయ్య



సిద్ధయ్య (ఫైల్)



చిన్నగొట్టిగల్లు మండలంలో పంట పొలాలపైకి వస్తున్న ఒంటరి ఏనుగు

గ్రామాలమీదికి దూసుకొస్తున్న గజరాజులు

- ఏనుగుల దాడిలో మృత్యువాత పడుతున్న రైతన్నలు
- సరిహద్దు సమస్యలతో చేతులెత్తేస్తున్న అధికారులు
- భయాందోళనలో గ్రామీణులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: జగరాజులు స్వైరవిహారం చేస్తున్నాయి. అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని పంట పొలాలను నాశనం చేస్తున్నాయి. కనిపించిన రైతులను తొండంతో కొట్టి.. కాళ్లతో తొక్కి ప్రాణాలు తీస్తున్నాయి. వారిపైనే ఆధారపడ్డ కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

ప్రాణాలు తీసుకుంటున్న రైతులు

శేషాచల అభయారణ్యంలో ఏనుగులకు ఆహారం, నీటి లభ్యత తక్కువ. ఈ క్రమంలో చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, పాకాల మండలాల వైపు దూసుకొస్తున్నాయి. రాత్రుల్లో పంటలు కాపాడుకునేందుకు పొలాల వద్దకు కాపలాగా వెళ్లిన రైతులను గుర్తించి తొక్కి చంపేస్తున్నాయి. గత పది నెలల కాలంలో తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ముగ్గురు రైతులు, చిత్తూరు జిల్లా, పుంగనూరు నియోజకవర్గంలో ఒకరు ఏనుగుల దాడిలో మృతి చెందారు.

వేధిస్తున్న జిల్లాల సరిహద్దు సమస్య

చిత్తూరు జిల్లా పరిధిలోని పలమనేరు వద్దనున్న కౌండిన్య అభయారణ్యం నుంచి ఏనుగులను తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు దారి మళ్లించాల్సి ఉంది. కానీ ఎలిఫెంట్ ట్రాకర్లు శేషాచలం అడవుల్లోకి తరిమేస్తున్నారు. ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి జిల్లాలు వేరు కావడంతో అటవీశాఖ ఉన్నతాధికారుల్లో సరిహద్దు సమస్య తలనొప్పిగా మారింది.

తిరుపతి జిల్లాలో ఎలిఫెంట్ ట్రాకర్లు నిల్

చిత్తూరు జిల్లా పరిధిలో ఎలిఫెంట్ ట్రాకర్ల నియామకం భారీ ఎత్తున చేపట్టారు. కొత్తగా ఏర్పాటైన తిరుపతి జిల్లాలో మాత్రం అలాంటి చర్యలేవీ చేపట్టలేదు. తిరుపతి జిల్లాలో ఎలిఫెంట్ ట్రాకర్లు లేకపోవడం, పలమనేరు పరిసరాల నుంచి ఏనుగులు పెద్ద సంఖ్యలో శేషాచలం అడవులకు చేరడంతో వాటిని కట్టడి చేయలేకపోతున్నట్టు అటవీ శాఖలో పనిచేసే ఒక అధికారి చెబుతున్నారు. చిత్తూరు జిల్లా పరిధిలో పనిచేసే ఎలిఫెంట్ ట్రాకర్లను ఇక్కడ ఉపయోగించుకోవడానికి నిబంధనలు అడ్డొస్తున్నట్టు పేర్కొన్నారు. విధిలేని పరిస్థితుల్లో అటవీ శాఖలో పనిచేసే వాచర్లు, బేస్ క్యాంపు సిబ్బందిని వాడుకుంటున్నట్టు సమాచారం.

మొక్కుబడిగా పరిహారం

గత ఏడాది మార్చిలో పాకాల మండలంలోని పది పుట్లబైలు, ఇ.పాలగుట్టపల్లి, వల్లివేడు, తోట తిమ్మయ్యపల్లి, పేరసానిపల్లి గ్రామాల్లో మొక్కుబడిగా ఒకరిద్దరికి పరిహారం అందించారు. పంట నష్టం జరిగిన మిగతా రైతులు అర్జీలు పెట్టుకున్నా ఇప్పటి వరకు పరిహారం అందలేదు. అలాగే చిన్నగొట్టిగల్లు మండలం, పులిచెర్ల, చంద్రగిరి మండలాల్లోని రైతులు కూడా పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు.

రైతుల భద్రత గాలికి

శేషాచలంలో కొండల్లో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఏనుగులు తిష్టవేస్తున్నాయి. సాధారణం వేసవిలో పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో దశాబ్దాల కాలంగా ఏనుగుల సమస్య ఉంది. దీనిపై స్పందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు 50 మందికిపైగా ఎలిఫెంట్ ట్రాకర్స్‌ను నియమించాయి. కుంకీ ఏనుగులను అందుబాటులోకి తెచ్చాయి. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో ఏనుగులు అడవి నుంచి బయటకు రాకుండా అటవీ సరిహద్దుల్లో ట్రెంచ్‌లను ఏర్పాటు చేశారు. అధనంగా ట్రాకర్లను నియమించారు. దీంతో కొంతవరకు ఏనుగుల సమస్య తగ్గింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక వాటన్నింటినీ పక్కనపెట్టడంతో మళ్లీ సమస్య మొదటికొచ్చింది.

వరుస ఘటనలివే

- ఈ ఏడాది జనవరి 19న చంద్రగిరి మండలం, నారావారిపల్లి సమీపంలోని బి.కొంగర వారిపల్లి వద్ద ఉప సర్పంచ్ రాకేష్ చౌదరిని ఏనుగులు తొక్కి చంపేశాయి.
- జనవరిలోనే చిత్తూరు జిల్లా, పుంగనూరు నియోజకవర్గం పులిచెర్ల మండలంలో ఓ రైతును, నాలుగు నెలల కిందట పాకాల మండలం చెన్నుగారిపల్లి వద్ద మరో వ్యక్తిని చంపేశాయి.
- ఫిబ్రవరి, మార్చి నెలల్లో 17 ఏనుగులు తిరుపతి జిల్లాలోని పాకాల, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, చిత్తూరు జిల్లా పరిధిలోని పులిచెర్ల, సదుం, సోమల, ఐరాల మండలాల్లో స్వైర విహారం చేశాయి. వందలాది ఎకరాల్లో పంటను నాశనం చేశాయి.
- చంద్రగిరి, పాకాల మండలాల్లో గత రెండు నెలలుగా ఏనుగులు పంటలను తొక్కినాశనం చేస్తున్నాయి.
- నెల క్రితం చంద్రగిరి మండలం, భీమవరం నుంచి పులిచెర్ల మండలం, కొత్తపేటకు వెళ్లే అటవీ మార్గంలో వాహనదారులపైకి ఏనుగులు దాడికి ప్రయత్నించాయి.
- చిన్నగొట్టిగల్లు మండలం, చిట్టేచెర్ల పంచాయతీ, దాసరిగూడెంకు చెందిన సిద్ధయ్య అనే రైతును శుక్రవారం రాత్రి ఓ ఏనుగు తొక్కి చంపింది.

పంట పొలాల వద్దకు వెళ్లలేకున్నాం



“ పట్టపగలు ఏనుగులు వచ్చేస్తున్నాయి. పొలాల వద్దకు ఒంటరిగా వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి. గుంపులు గుంపులుగా వెళ్లాలంటే అందరికీ ఒకే సారి పొలాల వద్ద పనులు ఉండవు. ఒక వేళ రైతులు గుంపుగా వెళ్లినా ఏనుగులు తిరగబడితే ఏం చేయగలం.

– పీరయ్య, రైతు, దాసరిగూడెం, చిట్టేచర్ల

బతకలేకపోతున్నాం



అడవులకు సమీపంలో పంట పొలాలను సాగు చేసుకుని బతుకుతున్నాం. గత కొన్ని నెలలుగా ఏనుగులు విపరీతంగా వచ్చేస్తున్నాయి. మహిళలు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఏనుగులు పొలాల్లోకే కాదు గ్రామాల్లోకి కూడా చొరబడుతున్నాయి.

– నాగమునెమ్మ, మహిళా రైతు, దాసరిగూడెం

చర్యలు తీసుకుంటాం

ఏనుగులను దారి మళ్లించేందుకు సరిపడా సిబ్బంది లేరు. ఉన్న వారితో టపాకాయలు పేల్చి వీలైనంత వరకు పంట పొలాలు, గ్రామాలపైకి రాకుండా కట్టడి చేస్తున్నాం. ఏనుగులు వచ్చినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎలిఫెంట్ ట్రాకర్స్ కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వీలైనంత వరకు ఒంటరి ఏనుగులకు రైతులు దూరంగా ఉండాలని సూచిస్తున్నాం.

– వెంకటరమణ నాయక్, భాకరాపేట రేంజ్‌జీ అధికారి

కాలువలోకి దూసుకెళ్లిన శ్రీసిటీ బస్సు

- 22 మందికి స్వల్ప గాయాలు



ధ్వంసమైన బస్సు అద్దం

నాగలాపురం: పెను ప్రమాదం తప్పింది. శ్రీసిటీలోని ఓ కంపెనీకి చెందిన బస్సు అతివేగంగా కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 22 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ సునీల్ తెలిపిన వివరాల మేరకు.. శ్రీసిటీలోని ఓ కంపెనీకి చెందిన బస్సు కార్మికులను ఎక్కించుకుని నాగలాపురానికి వస్తోంది. మార్గమధ్యంలో వేంబాకం దళితవాడ వద్ద బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. బస్సులో మొత్తం 35 మంది కార్మికులుండగా.. అందులో 22 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నాగలాపురం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం 9 మందిని నగరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇందులో బస్సు డ్రైవర్ అరవింద్‌కు ఊపిరి పీల్చుకోవడంలో కాస్త ఇబ్బందిగా ఉన్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు. బస్సు వేగంగా నడపడం వల్లే ప్రమాదానికి గురైనట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అమ్మో..నాగరాజు!



పాముతో భాస్కర్ నాయుడు

తిరుమల : తిరుమలలోని స్పెషల్‌టైప్ నారాయణగిరి అతిథి గృహాల వద్ద శనివారం నాగుపాము కలకలం సృష్టించింది. పామును గుర్తించిన స్థానికులు టీటీడీ అటవీ ఉద్యోగి భాస్కర్‌నాయుడుకి సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఆయన చాకచక్యంగా ఐదున్నర అడుగుల నాగుపామును పట్టి.. అవ్వాచ్చారి కోనలో విడిచిపెట్టారు.

కూటమి నేత దౌర్జన్యం

బాలాయపల్లి(సైదాపురం): కూటమి నేత దౌర్జన్యాలకు ఓ కుటుంబం కుమిలిపోతోంది. ఈ ఘటన బాలాయపల్లి మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం.. బాలాయపల్లి మండలం, మన్నూరు గ్రామానికి చెందిన ఒప్పతొట్టి రవీంద్రయ్యతోపాటు మరో 61 మంది దళితులకు అదే గ్రామ సర్వే నం.6లో ప్రభుత్వం లీజు పట్టాలు జారీచేసింది. ప్రస్తుతం సాగునీటి కొరత కారణంగా ఆ భూములు బీళ్లుగా వదిలేశారు. ఇటీవల రవీంద్రయ్య మృతిచెందడంతో.. ఇదే అదునుగా భావించిన కూటమి పార్టీలకు చెందిన ఓ చోటా నేత చెలరేగిపోయాడు. మృతుడికి ఉన్న రెండు ఎకరాల్లో పాగా వేశాడు. అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్నాడు. పెద్ద దిక్కును కోల్పోయి ఉంటే ఇలా బరితెగించి ఆ కుటుంబాన్ని వేధించడం ఏంటని స్థానికులు మండిపడుతున్నారు. గతంలో అక్రమార్కులకు అడ్డుతగిలినందుకు రవీంద్రయ్యపై కక్ష్యగట్టి ఇలా వేధిస్తున్నట్టు మృతుని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఆక్రమణల తొలగింపు

తిరుపతి రూరల్ : మండలంలోని అవిలాల గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 18, యోగిమల్లవరం రెవెన్యూ లెక్క దాఖలా సర్వే 1/1లో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించారు. తహసీల్దార్ రామాంజులు నాయక్ ఆదేశాల మేరకు అధికారులు శనివారం ఆయా ప్రాంతాల్లో పర్యటించిన ఆక్రమిత స్థలంలో వేసిన గుడిసె, ఫెన్సింగ్‌ను తొలగించారు.

పదిలో 'దివ్యమైన' మెరుపులు



విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న డీఈఓ కేవీఎన్.కుమార్

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రాల ప్రత్యేక అవసరాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటారు. జిల్లా నుంచి 172 మందికి గాను 156 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 101 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో నారాయణవనం మండలం, పాలమంగళం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మేరువా ఆశిష్ 481 మార్కులతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాడు. అలాగే పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పీ.సాత్విక 449 మార్కులతో ద్వితీయ స్థానం, తిరుపతి బైరాగిపట్టెడలోని ఎస్పీ జేఎన్ఎం విద్యార్థి షేక్ హర్షద్ 430 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచాడు. వీరిని శనివారం డీఈఓ కేవీఎన్.కుమార్ అభినందించి వారికి ట్యాబ్‌లను బహూకరించారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా కో–ఆర్డినేటర్ డీ.చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఓ గోపాలకృష్ణ, ఏఎస్ఓ రుక్మాంగధ పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో సత్తా చాటిన దివ్యాంగ విద్యార్థులు



ప్రతిభ చాటిన దివ్యాంగ క్రీడాకారులను అభినందిస్తున్న డీఈఓ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏలూరు జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీడబ్ల్యూఎస్ఎన్ క్రీడా పోటీల్లో తిరుపతి జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరచి పతకాలు సాధించారు. ఈ పోటీల్లో పల్లమాల ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎం.ప్రతాప్ బేస్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించాడు. అలాగే 100, 200 మీటర్ల పరుగు పందెంలో శ్రీకాంత్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. వీరిని శనివారం డీఈఓ కేవీఎన్.కుమార్ అభినందించి జ్ఞాపికలతో సత్కరించారు. కోచ్‌లు గోపీకృష్ణ, నాగరాజు, జిల్లా సహిత విద్య కో–ఆర్డినేటర్ డీ.చంద్రశేఖర్‌రెడ్డి, సెక్టోరల్ ఆఫీసర్లు, ఐఈఆర్‌డీలు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్‌లో హాస్టల్ విద్యార్థుల ప్రతిభ



టెన్త్ విద్యార్థులతో కలెక్టర్ వెంకటేశ్వర్



ఇంటర్ విద్యార్థులతో కలెక్టర్

తిరుపతి అర్బన్: సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో ఉంటూ టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అభినందించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలోని అన్ని సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌కు చెందిన విద్యార్థులు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని ప్రత్యేకంగా అభినందించారు. మరింత ఏకాగ్రతకు యోగా, ధ్యానం విద్యార్థులకు నేర్పించాలని సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారి విక్రమకుమార్‌రెడ్డిని ఆదేశించారు. అంతరం విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలతోపాటు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆత్మకథ అయిన వింగ్స్ ఆఫ్ ఫైర్‌ను విద్యార్థులకు బహుమతిగా అందజేశారు. ఎస్సీ హాస్టల్స్‌లో పదో తరగతిలో టీ.విశ్వనాథ్–586, బీ.హనుమంతు–580, పీ.భావన–577, డీ.భగీరత్–566, నీలాకుమార్–559, పీ.భానుశ్రీ–555, ఎం.గుణశేఖర్–552, ఎస్.దినేష్–550 ఉత్తమ మార్కులు సాధించగా.. ఇంటర్‌లో బీ.హైమావతి–942, ఎం.నీలావతి–929, డీ.లక్ష్మీప్రసన్న–915, ఆర్.యువశ్రీ–913, ఎస్.రాజు–911, జీ.సంజయ్–911 అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్టు తెలిపారు.

'సంకీర్తనామృతం' ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు

తిరుపతి కల్చరల్ : శ్రీపురం కాలనీలోని శ్రీమళయాళ సద్గురు సేవా సమాజం ఆవరణలో వేంకటపతిస్వామి వారు రచించిన పాతక సంకీర్తనల విశ్లేషణ పూర్వక గ్రంథం 'శ్రీపద సంకీర్తనామృతం' పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. తాళ్లపాక హరినారాయణాచార్య, ఎస్వీయూ విశ్రాంత ఆచార్యుడు కె.సర్వోత్తమరావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ గాలి గుణశేఖర్, ఆధ్యాత్మిక వేత్త గంగవరపు శ్రీదేవి, అటవీ శాఖ మేనేజర్ వెంకటరమణ శర్మ, శతవధాని డాక్టర్ మేడసాని మోహన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మట్టి దందాకు చెక్

చంద్రగిరి : మండలంలోని శానంబట్ల పంచాయతీ శివగిరి వద్ద సాగిస్తున్న మట్టి దందాను రెవెన్యూ అధికారులు శనివారం అడ్డుకున్నారు. డీకేటీ పొలంలో కొంత మంది అక్రమంగా జేసీబీ సాయంతో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తవ్వి తరలిస్తుండగా వీఆర్‌ఓ శివ తన సిబ్బందితో కలసి చెక్ పెట్టారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ



శిక్షణ శిబిరంలో ఎమ్మెల్యే ఆరణి తదితరులు

తిరుపతి తుడా : బీసీ కార్పొరేషన్, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ అందిస్తున్నారు. శనివారం ఈ మేరకు స్థానిక సీఎస్‌సీ సెంటర్‌లో శిక్షణ తరగతులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శిక్షణకు 360 మంది మహిళలు ఎంపిక కావడం శుభపరిణామమన్నారు. మహిళల సాధికారత కోసం కూటమి సర్కారు కృషి చేస్తోందని చెప్పారు. మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ఈడీ శ్రీదేవి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, నాయీబ్రాహ్మణ చైర్మన్ రుద్రకోటి సదాశివం, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య పాల్గొన్నారు.

ఆస్పత్రికి పరికరాల వితరణ



పరికరాలు అందిస్తున్న దాత

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రిలో ఆర్థో విభాగానికి సంబంధించిన పరికరాలను దాత పుట్టారెడ్డి డమరుకనాథరెడ్డి శనివారం వితరణగా అందించారు. చిన్నగొట్టిగల్లు మండలం చెరువుముందరపల్లెకు చెందిన ఆయన ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై రుయాలో చేరారు. ఎముకలు విరగడంతో వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఈ క్రమంలో కోలుకున్న డమరుకనాథరెడ్డి తన మనుమడు పుట్టారెడ్డి ధృవ పేరుతో పరికరాలను ఆస్పత్రికి కానుకగా అందించారు. కార్యక్రమంలో వైద్యులు మధుసూదన్, వెంకట్, రవిశంకర్, వంశీ యాదవ్, వినయ్ పాల్గొన్నారు.

రఘురామ వైఖరిపై ఆగ్రహం

తిరుపతి కల్చరల్ : సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉప సభాపతి రఘురామకృష్ణమ రాజుపై సీపీఎం, సీపీఐ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు వి.నాగరాజు, పి.మురళి మాట్లాడారు. రఘురామ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఆర్‌పీఐ నేత అంజయ్య ,ఆమ్ ఆద్మీ పార్టీ నేత నగేష్, కేతారి రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఎస్‌డీహెచ్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న చక్రవర్తిరెడ్డి

తిరుపతి సిటీ : న్యూ బాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులు ప్రతిభ చూపి బహుళజాతి కంపెనీలలో ఉద్యోగాలు సాధించారు. కళాశాల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు 215 మంది ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు జాయినింగ్ లెటర్లు అందించారు. ఈ క్రమంలో ప్రిన్సిపల్ ఉష, అధ్యాపకులతో కలసి విద్యార్థులను అభినందించారు.

కేసుల ఛేదనపై ప్రత్యేక శ్రద్ధ

తిరుపతి క్రైమ్ : పెండింగ్ కేసుల ఛేదనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. శనివారం పోలీస్ గెస్ట్ హౌస్ లో నిర్వహించిన క్రైమ్ మీటింగ్ లో ఆయన మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

హేయం.. ఉగ్రవాదం



ఎస్వీ వైద్య కళాశాల వైద్య కళాశాల నేషనల్ మెడికో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో యూజీ, పీజీ వైద్య, పారా మెడికల్ విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. కశ్మీర్‌లో ఉగ్రదాడికి నిరసన తెలిపారు. భారత్‌మాతాకీ జై అంటూ నినదించారు. డాక్టర్ రోజారమణి మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అంటూ మండిపడ్డారు. మృతులకు నివాళులర్పించారు. – తిరుపతి తుడా

మైమరిపించిన వేడుక



ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఆడిటోరియంలో శనివారం వరల్డ్ వెటర్నరీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఉద్యోగుల పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. పశువుల సంరక్షణపై అవగాహన కల్పించేలా నృత్యం చేసి అలరించారు. తలపై రేడియం కొమ్ములు ధరించి హల్‌చల్ చేశారు. ఏటా పశువైద్య కళాశాలలో నిర్వహించే వెటర్నరీ దినోత్సవానికి చిన్నారులు హాజరై సంఘీభావం తెలియజేస్తారని నిర్వాహకుడు డాక్టర్ కృష్ణారావు వెల్లడించారు. – తిరుపతి సిటీ

నోటీస్ బోర్డు

- ఉగ్రదాడికి నిరసనగా ఉదయం 7 గంటలకు వాకర్స్ అసోసియేషన్ ర్యాలీ.
- యూత్‌హాస్టల్‌లో ఉదయం 10 గంటలకు భగత్‌సింగ్ అధ్యయన కేంద్రం ప్రారంభం.
- తిరుపతి సిటీ చాంబర్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు మహతి కళాక్షేత్రంలో ఉగాది పురస్కారాల ప్రధానోత్సవ సభ.
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు 'ట్రంప్ దూకుడు–భారత్‌పై ప్రభావం' అనే అంశంపై సదస్సు.
- జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్‌లో ఉదయం 10.45 గంటలకు పర్యావరణ వేత్తల మీడియా సమావేశం.
- తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఉదయం 10 గంటలకు మీడియా సమావేశం.

వనం.. విలాపం

- నగర వనంలో విధ్వంసం
- క్యాంటిన్ కోసం చెట్ల నరికివేత
- అటవీశాఖ అధికారుల నిర్వాకంపై ప్రకృతి ప్రేమికుల ఆగ్రహం

పచ్చటి చెట్లు.. ప్రశాంత వాతావరణం.. ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామం.. నగర వాసులు సేదతీరే స్థలం.. వాకర్స్‌ను మరింత ఉత్సాహపరిచే ప్రాంతం.. స్వచ్ఛమైన గాలితోపాటు ఔషధ మొక్కలకు ఆలవాలం.. పిల్లలను విపరీతంగా ఆకట్టుకునే నగరవనం.. తిరుపతికే తలమానికం. అంతటి ప్రత్యేకతను సంతరించుకున్న పార్కులో అటవీశాఖ అధికారులు విధ్వంసం సృష్టించారు. భారీ వృక్షాలను యథేచ్ఛగా నరికేశారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లే పరిస్థితి కల్పించారు. కేవలం ఓ క్యాంటిన్ ఏర్పాటు చేసేందుకు ఏళ్ల నాటి చెట్లను ఇష్టారాజ్యంగా పెకలించేశారు. వందలాది పక్షిజాతులకు ఆవాసం లేకుండా చేశారు.



నగర వనం ప్రధాన ద్వారం

తిరుపతి మంగళం : పర్యావరణానికి అటవీశాఖ అధికారులే తూట్లు పొడుస్తున్నారు. తిరుపతిలోని నగరవనంలో 'వనరుచి క్యాంటీన్' ఏర్పాటు కోసం చెట్లను నరికించేశారు. మొక్కలు నాటి అడవులను సంరక్షించాల్సిన అటవీశాఖ అధికారులే చెట్లను నాశనం చేయడంపై ప్రకృతి ప్రేమికులు మండిపడుతున్నారు. ఆ శాఖ పరిధిలోని కపిలతీర్థం, జంగిల్‌బుక్, బయోట్రీమ్ వంటి ప్రాంతాలలో క్యాంటిన్ ఏర్పాటు చేసుకోవచ్చు కదా అని ప్రశ్నిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నాటి భారీ వృక్షాలను వేళ్లతో సహా తొలగించడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యంత విలువైన ఎర్రచందనం చెట్లతో పాటు అనేక ఔషధ మొక్కలను నరికివేయడం సరికాదని వాపోతున్నారు. అయితే అటవీశాఖ అధికారులు మాత్రం పర్యావరణానికి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా నగరవనంలో వనరుచి క్యాంటిన్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నారు. ఆ ప్రాంతంలో మరిన్ని ఔషధ మొక్కలు, కొత్త రకాల మొక్కలను సైతం విరివిగా నాటుతామని వెల్లడిస్తున్నారు.

విచారణకు ఆదేశం?

తిరుపతి నగరవనంలో చెట్ల నరికివేతపై అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మొత్తం ఘటనపై విచారణకు ఆదేశించినట్లు అధికారులు చెబుతున్నారు. అటవీ నింబంధనల ఉల్లంఘనపై విచారణ అధికారిగా పీసీసీఎఫ్ పీవీ చలపతిరావు నియమించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. అనంతరామ్ ఉత్తర్వులు కూడా జారీ చేసినట్లు సమాచారం.







క్యాంటీన్ ఏర్పాటు కోసం నరికివేసిన చెట్లు

అధునాతన టెక్నాలజీతో కార్డియాలజీ సేవలు



మాట్లాడుతున్న డాక్టర్ విజయచంద్రారెడ్డి

తిరుపతి తుడా : అపోలో హాస్పిటల్‌లో అధునాతన టెక్నాలజీ వినియోగించి కార్డియాలజీ సేవలు అందిస్తున్నట్లు చెన్నై అపోలో హాస్పిటల్స్ కార్డియాలజిస్ట్ డాక్టర్ విజయచంద్రారెడ్డి తెలిపారు. శనివారం తిరుపతిలోని ఓ హోటల్లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గుండెను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆరోగ్యకర డైట్, అలవాట్లు, నో స్మోకింగ్, ఒత్తిడి, షుగరు, కొలస్ట్రాల్, రెగ్యులర్ చెకప్, వెయిట్ నియంత్రణ పాటించాలని సూచించారు. యువత సైతం అతిగా జిమ్ చేయడం ప్రమాదకరమని, దీంతో అధికంగా గుండెపోటుకు గురవుతున్నారని హెచ్చరించారు. బైపాస్ సర్జరీల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని, చిన్న బైపాస్ సర్జరీలు, మేజర్ బైపాస్ సర్జరీలను కూడా రోబోటిక్ ద్వారా చేయగలుగుతున్నామని వివరించారు. దీంతో పాటు యాంజియో ప్లాస్టీ విధానాల్లో సైతం పురోగతి సాధించామని వెల్లడించారు. ఐవీఎల్ షార్ట్ థెరపీని కూడా అపోలో హాస్పిటల్ అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో అపోలో హాస్పిటల్ సీనియర్ జీఎం డాక్టర్ నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం



వేడుకలో అధికారులు

తిరుపతి సిటీ : పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ రవి కుమార్ కోరారు. శనివారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పశువైద్యకళాశాల ఆడిటోరియంలో వరల్డ్ వెటర్నరీ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను రైతులకు తెలియజేయాలని కోరారు. వీసీ రమణ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే వెటర్నరీ వైద్యులు పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య, వెటర్నరీ అసోసియేషన్ నేత డాక్టర్ శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్‌ఎస్ కృష్ణారావు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై ముగిసిన శిక్షణ

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని నర్సింగ్ కళాశాల, చంద్రగిరి మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్ ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థినులకు సీపీఆర్ విధానంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. అత్యవసర సమయంలో ప్రాణాలను కాపాడేందుకు సీపీఆర్ ఉపయోగపడుతుందని, దీనిపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ గంగా భవానీ, ఎస్వీ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సునీత, హైదరాబాద్ ఐసీఎంఆర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ విభాగాధిపతి డాక్టర్ జేజే బాబు, స్విమ్స్ కార్డియాలజీ ప్రొఫెసర్ వనజాక్షమ్మ, ప్రొఫెసర్ యూవీ ప్రసాద్, డాక్టర్ రోహిత్ గుప్తా, డాక్టర్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

'జెండా' నటులకు సత్కారం



నటీనటులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: అచ్యుత్ కోవిద్ దర్శకత్వంలో ఎంకే సినిమాటిక్స్ బ్యానర్‌పై నిర్మితమైన 'జెండా' షార్ట్ ఫిలిం చిత్రం నాలుగు అత్యుత్తమ పురస్కారాలు కైవసం చేసుకున్న సందర్భంగా నటీనటులను చిగోరా ఆధ్యాత్మిక కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ చిత్రం ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌కు ఎంపిక కావడమే కాకుండా, ఉత్తమ చారిత్రాత్మక చిత్రంగా అవార్డు, బెస్ట్ డైరెక్షన్‌కు పురస్కారం అందుకుంది. రిటైర్డ్ ప్రిన్సిపల్ స్వరాజ్యలక్ష్మి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, సీఆర్‌కే శేషగిరిరావు, భాగవతుల జయలక్ష్మి, హనుమంతరావు, అపర్ణ, రాధ పాల్గొన్నారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి



ఏనుగల దాడిలో ధ్వంసమైన అరటి చెట్లు

పాకాల: పంట పొలాలపై ఏనుగుల గుంపు దాడి చేసినట్టు రైతులు వాపోతున్నారు. శనివారం వారు తెలిపిన వివరాల మేరకు.. అటవీసరిహద్దులోని గానుగపెంట గ్రామ సమీప పొలాల్లోకి సుమారు 15 ఏనుగుల గుంపు శుక్రవారం రాత్రి చొరబడ్డాయి. స్థానిక గ్రామానికి చెందిన గుడి రమేష్ మల్బరీ షెడ్డు కంచెను ధ్వంసం చేశాయి. అక్కడే ఉన్న అరటి చెట్లు, బొప్పాయి, కొబ్బరి చెట్లు, పచ్చిక పొలాలను నాశనం చేశాయి. అనంతరం ఘటనా స్థలం నుంచి సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న చెరువు వద్దకు చేరుకుని తిరిగి ఫారెస్ట్‌లోకి వెళ్లినట్టు స్థానికులు చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల కట్టడికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎండోమెంట్ స్కాలర్‌షిప్‌ల ప్రదానం



స్కాలర్‌షిప్ అందిస్తున్న దాత గోవిందరాజులు, వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో ఆచార్య పి.గోవిందరాజులు, డాక్టర్ పి.ఉషా రాణి ప్రారంభించిన ఎండోమెంట్ స్కాలర్‌షిప్‌లను శనివారం వర్సిటీ సెనెట్ హాల్‌లో వీసీ అప్పారావు చేతులమీదుగా విద్యార్థులకు ప్రదానం చేశారు. వీసీ మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులకు ఉజ్వల భవిత ఉంటుందన్నారు. ప్రొఫెసర్ గోవిందరాజులు, తన సతీమణి డాక్టర్ ఉషా రాణి జ్ఞాపకార్థం ప్రతిభగల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం అభినందనీయమన్నారు. ఈ క్రమంలో ఏపీపీజీసెట్–2024లో టాపర్స్‌గా నిలిచి రూ. 17,627ల స్కాలర్‌షిప్‌ను అఖిల, దీప్తి, లీలావతి అందుకున్నారు. అలాగే పీజీ ఎమ్మెస్సీ మ్యాథ్స్ మొదటి ఏడాదిలో టాపర్స్‌గా నిలిచి రూ. 8,814ల స్కాలర్‌షిప్‌ను బేబీ హేమలత, సాయి ప్రమిద పొందారు. అప్‌లైడ్ మాథ్స్‌లో టాపర్స్‌గా నిలిచిన సుమిత్ర, కంప్యూటర్స్‌లో గోపిక రూ. 17,627 స్కాలర్‌షిప్ అందుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రిన్సిపాళ్లు ఆచార్య కె.నరసయ్య, ఆచార్య వి.పద్మావతి పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ పనితీరు భేష్

తిరుపతి అర్బన్: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సీసీ రోడ్ల ఏర్పాటుకు సంబంధించి పంచాయతీరాజ్ అధికారుల పనితీరును కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అభినందించారు. జిల్లాలో 215.50 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించి రాష్ట్రంలో జిల్లాను నాల్గో స్థానంలో నలబెట్టారని కొనియాడారు.యీ మేరకు అవార్డు కూడా అందుకున్నట్టు గుర్తుచేశారు. పంచాయతీరాజ్ జిల్లా అధికారి రామ్మోహన్‌తోపాటు ఆ విభాగానికి చెందిన ఉద్యోగులను కలెక్టర్ అభినందించారు.



అవార్డును కలెక్టర్‌కు చూపుతున్న పంచాయతీ రాజ్ జిల్లా అధికారి రామ్మోహన్

జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి తదితరులు

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ జాతర పోస్టర్‌ను శనివారం అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మే 6న చాటింపుతో ఆరంభమయ్యే గంగమ్మ తల్లి జాతర 14వ తేదీ వేకువన అమ్మవారి విశ్వరూప దర్శనంతో ముగుస్తుందన్నారు. జాతరను సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సామాన్యభక్తులు త్వరగతిన అమ్మవారి దర్శనం చేసుకునేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా మే 10వ తేదీన అమ్మవారికి సారె సమర్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఏ.జయకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

భాకరాపేట : పదో తరగతి ఫలితాల్లో చిన్నగొట్టిగల్లు మండలం టాపర్‌గా నిలిచిన భాకారాపేట సాయిరాం స్కూల్ విద్యార్థి సంతోష్‌కుమార్‌ను ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నేతలు ఓవీఆర్‌రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ జనార్ధనరెడ్డి పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : మే డే స్ఫూర్తితో కార్మిక వర్గం తమ హక్కుల సాధనకు పోరాటం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి పి.వెంకటరత్నం పిలుపు నిచ్చారు. ఆదివారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో 139వ మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. నేతలు లోకేష్, అరుణ, రాణి, నందిని, జ్యోతి, లక్ష్మి, నిర్మల, స్వప్న, సుబ్రమణ్యం, మోహిత్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



మహిళను కుటుంబసభ్యులకు అప్పగించిన పోలీసులు

తిరుమల: శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన కుటుంబంలో నుంచి ఓ బాలుడు తప్పిపోగా పోలీసులు సకాలంలో గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. తిరుమల టూటౌన్ పీఎస్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం, శివమొగ్గ, కాడెనంది హలికి చెందిన రేణుక–శేఖరప్ప దంపతులు తమ ముగ్గురు పిల్లలతో కలిసి ఈనెల 25న తిరుమలకు చేరుకున్నారు. అదే రోజు రాత్రి 8 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులు మాధవ నిలయం ఎదురుగా ఉన్న దుకాణంలో టీ తాగుతుండగా వారి కుమారుడు మాన్విత్ (6) కనిపించకుండా పోయాడు. ఆ తర్వాత మాధవ నిలయం వద్ద పోలీసు, విజిలెన్స్ సిబ్బంది ఒంటరిగా ఉన్న బాలుడిని గుర్తించి సంరక్షించారు. శనివారం తల్లిదండ్రులకు బాలుడిని అప్పగించారు.

మహిళ అప్పగింత

కుటుంబసభ్యులపై అలిగి తిరుమలకు చేరుకున్న మహిళను తమ కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. విశాఖపట్టణానికి చెందిన కే.వెంకటరామారావు, కంద్రేగుల రమ్యరాజు(40) దంపతులు. ఆర్థిక సమస్యల కారణంగా మనస్తాపానికి గురై ఈనెల 24వ తేదీన విశాఖపట్నం నుంచి బయలుదేరి 25వ తేదీన రమ్యరాజు తిరుమలకు చేరుకుంది. ఒక భక్తుడి మొబైల్ నంబర్ నుంచి తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి.. తాను తిరుమలలో ఉన్నట్టు తెలిపింది. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ఆమెను వెదికి పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా తిరుమల పోలీసులను ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించారు.